

నిప్పు ముప్పు తప్పేలా

అగ్ని ప్రమాదాల నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మాక్‌డ్రిల్స్ చేయనున్నారు. - 8లో



భూములు కాజేయాలనుకున్నారు

టీడీపీ నాయకులపై ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శలు చేశారు. పోర్టు పేరిట మోసం చేశారని అన్నారు. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	41°	25°
ఇచ్ఛాపురం	40°	25°
పలాస	39°	24°
టెక్కలి	39°	23°
పాతపట్నం	38°	25°
నరసన్నపేట	40°	24°
శ్రీకాకుళం	41°	24°



న్యూస్‌రీల్

విద్యుత్ శాఖ ఇంజినీర్లకు బదిలీలు

అరసవల్లి: తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకాకుళం సర్కిల్ పరిధిలోని పలు విభాగాల్లో ఇంజినీర్లకు బదిలీలు చేస్తూ.. గురువారం ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు ఉత్తర్వులను జారీ చేశారు. శ్రీకాకుళం డివిజన్ డిప్యూటీ ఈఈగా పనిచేస్తున్న ఎస్.సునీల్‌కుమార్‌ను నర్సీపట్నం డిప్యూటీ ఈఈగా బదిలీ చేశారు. ఈయన స్థానంలో ఇంకా ఎవ్వరినీ నియమించలేదు. కోటబొమ్మాళి ఏఈగా పనిచేస్తున్న జీవీ సురేష్‌కు శ్రీకాకుళం రూరల్ ఏఈగానూ, శ్రీకాకుళం కన్‌స్ట్రక్షన్స్ ఏఈగా పనిచేస్తున్న కర్రా జ్యోతిని శ్రీకాకుళం స్టోర్స్/ఇండోర్ ఏఈగానూ, అలాగే స్టోర్స్ ఏఈగా పనిచేస్తున్న ఎస్.సూర్యారావును కన్‌స్ట్రక్షన్స్ ఏఈగా నియమించారు. ఈ మేరకు ఉత్తర్వులను స్థానిక ఎస్‌ఈ ఎల్.దైవప్రసాద్ ధ్రువీకరించారు.

నేటి అర్ధరాత్రి నుంచే వేటకు విరామం

అరసవల్లి: సముద్రంలో చేపల సంతానోత్పత్తి కోసం శుక్రవారం అర్ధరాత్రి నుంచే తీర ప్రాంతాల్లో చేపల వేటపై నిషేధ ఆంక్షలు అమలులోకి రానున్నాయి. ఈ మేరకు మత్స్యశాఖ డీడీ పీవీ శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ నిబంధనలు వచ్చే జూన్ 14 అర్ధరాత్రి వరకు అమలులో ఉంటాయని, మత్స్యకారులు కచ్చితంగా నిబంధనలు పాటించాలని సూచించారు. లేదంటే ప్రభుత్వం అందించే రాయితీలు రద్దవుతాయని తెలిపారు.

ఉత్తమ సేవలకు పోలీసు సేవా పతకాలు

శ్రీకాకుళం క్రైమ్ : ఉత్తమ సేవలు కనబర్చిన అన్ని శాఖల(అగ్నిమాపక, విజిలెన్సు ఎన్‌ఫోర్సుమెంటు, సివిల్) పోలీసు అధికారులు, సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2023-ఉగాది పురస్కారాల్లో భాగంగా జిల్లాలో పలువురికి సేవా పతకాలు ప్రకటించింది. ఈ మేరకు స్టేట్ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది. సివిల్ ఎస్‌ఐ ఆర్.శంకరరావుకు ఉత్తమ సేవా పతకం లభించగా.. శ్రీకాకుళం దిశా డీఎస్పీ ఎస్.వాసుదేవరావు, మందస ఏఎస్‌ఐ కె.శేఖరరావు, ఏఆర్ హెచ్‌సీ టి.రాంబాబు, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్సుమెంట్ హెచ్‌సీ కె.అప్పన్న, శ్రీకాకుళం పీఎస్ పీసీ ఎ.మల్లేశ్వరరావు, అగ్నిమాపక విభాగం కోటబొమ్మాళి స్టేషన్ డ్రైవింగ్ ఆపరేటర్ బి.సూర్యారావులకు సేవా పతకాలు ప్రకటించారు.

'స్టోన్ ప్లాంటేషన్ వేగవంతం కావాలి'



వీసీలో పాల్గొన్న జేసీ నవీన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాల్లో చేపడుతున్న రీ సర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ జి.సాయిప్రసాద్ జిల్లా కలెక్టర్లను కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న రెండో విడత రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ పనులపై గురువారం కలెక్టర్లు, జేసీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో రీసర్వే, స్టోన్ ప్లాంటేషన్ లక్ష్యాలను అధిగమించడంపై హర్షం వ్యక్తం చేశారు.జేసీ ఎం.నవీన్ మాట్లాడుతూ జిల్లాలోని 126 రీసర్వే గ్రామాలకు గాను ఇప్పటికే 23 గ్రామాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన గ్రామాలు తుదిదశలో ఉన్నాయని, సోమవారం నాటికి పూర్తవుతాయని హామీ ఇచ్చారు. స్టోన్ ప్లాంటేషన్‌లో ఇప్పటికే 9,200 చేశామని చెప్పారు.

ఫోర్జరీ పునాదులపై అక్రమాల అంతస్తులు

పాతపట్నం నియోజకవర్గం కొత్తూరు మండలం నివగాంలో టీడీపీ నాయకుడు నూలు వీరభద్రస్వామి అక్రమంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనమిది. సర్వే నంబర్ 100లోని ప్రభుత్వ భూమిలో టీడీపీ అధికారంలో ఉండగా 2016లో అధికార దర్పంతో తన భార్య కరుణ పేరున అక్రమంగా నిర్మించారు. అక్రమంగా నిర్మించడమే కాకుండా ఆ భవనాన్ని వికాస గ్రామీణ బ్యాంకుకు అద్దెకిచ్చి లబ్ధిపొందుతున్నారు. మరో ఫ్లోర్‌లో వస్త్రాల దుకాణం నడుపుతున్నాడు. తనది అక్రమం కాదు...సక్రమమని తప్పుడు పత్రాలు కూడా సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి.



- ప్రభుత్వ స్థలంలో అక్రమంగా బహుళ అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం
- టీడీపీ అధికారంలో ఉండగా భవన నిర్మాణం
- పాతపట్నంలో టీడీపీ నాయకుడి కబ్జా పర్వం
- తప్పుడు పత్రాలు సృష్టించి నమ్మిస్తున్న వైనం
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన స్థానికులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

టీడీపీ అగ్రనాయకులను ఆదర్శంగా తీసుకుని చోటా నాయకులు కూడా అక్రమాల బాటన నడుస్తున్నారు. అమరావతి కరకట్టపై చంద్రబాబు తన నివాసం కోసం అక్రమంగా నిర్మాణం చేపట్టగా, అచ్చెన్నాయుడు తన నియోజకవర్గంలో ఏకంగా గోడౌన్‌ను అక్రమంగా నిర్మించారు. ఇక, పాతపట్నం టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణైతే కొత్తూరు నడిబొడ్డున సాగునీటి పారుదల శాఖ స్థలంలో అక్రమంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారన్న ఆరోపణలు ఇప్పటికే ఉన్నాయి. మా నేతలు చేస్తే తప్పు లేదు గానీ తాము చేస్తే తప్పా అన్నట్టుగా నివగాం టీడీపీ నాయకుడు వీరభద్ర స్వామి ప్రభుత్వ స్థలంలో అడ్డగోలుగా బహుళ అంతస్తుల భవనం నిర్మించాడు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మించడమే కాకుండా ఆ బహుళ అంతస్తుల భవనాన్ని ఫ్లోర్లవారీగా అద్దెకి కూడా ఇచ్చారు.

తప్పుడు పత్రాల సృష్టి



అక్రమంపై కలెక్టర్‌కు తహసీల్దార్ ఇచ్చిన నివేదిక

నివగాంలోని సర్వే నంబర్ 100లో ప్రభుత్వ భూమి (గోర్జి పోరంబోకు)గా రికార్డులో నమోదైంది. దీంట్లో 82 సెంట్లు భూమి ఉండగా, 47 సెంట్లను ప్రభుత్వం వివిధ అవసరాల కింద కేటాయించింది. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సీసీ రోడ్డు, యల్లమ్మ జాతర స్థలం కింద దాదాపు 47 సెంట్లు కేటాయించింది. ఇందులోనే కొంతమందికి నివాస పట్టాలు కూడా ఇచ్చింది. కానీ టీడీపీ నాయకుడు నూలు వీరభద్రస్వామికి ప్రభుత్వం ఎలాంటి స్థలం కేటాయించలేదు. కానీ అక్రమంగా బహుళ అంతస్తుల కమర్షియల్ భవనం నిర్మించారు. అంతేకాకుండా ఆ భవనం నిర్మాణం కోసం పంచాయతీ అనుమతి ఉందని తప్పుడు ధ్రువీకరణ పత్రం సృష్టించారు. వాస్తవంగా ఆ పత్రంపై సంతకం ఉన్న పంచాయతీ కార్యదర్శి ఆ సమయంలో అక్కడ పనిచేయలేదు. కానీ, కార్యదర్శి పేరున భవన ప్లాన్ అప్రూవల్ ఉన్నట్టుగా పత్రాలు తయారు చేశారు. దీనిపై నివగాం గ్రామస్తులు పలు పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. అక్రమ భవనం నిర్మాణంపై చర్యలు తీసుకోలేదు. గతంలో ఒక కార్యదర్శి ఇది అక్రమ కట్టడమని తేల్చినా కూడా చర్యలకు ఉపక్రమించలేదు. టీడీపీ నేతలు ప్రభావితం చేయడంతో అక్రమ కట్టడం జోలికిపోలేదు. చివరికి స్థానికులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు కదిలారు. ఎట్టకేలకు అది ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడమే అని కలెక్టర్‌కు నివేదించారు.

మొత్తానికి రోజురోజుకి టీడీపీ నాయకుల అక్రమాలు వెలుగు చూస్తూనే ఉన్నారు. సాగునీటి కాలువల కబ్జాలు బయటపడ్డాయి. చెరువుల ఆక్రమణలు వెలుగు చూశాయి. అక్రమ మైనింగ్ బయటపడింది. నీరు–చెట్టు, రోడ్లు పనుల్లో అవతవకలు వెలుగులోకి వచ్చాయి. ఎకరాల కొద్దీ ప్రభుత్వ భూములను ఆక్రమించిన బాగోతాలు బయటకు వచ్చాయి. ఎన్ని రకాలుగా అవకాశం ఉందో అన్ని రకాలుగా అక్రమాలు, ఆక్రమణలు, అవకతవకలు, అవినీతికి పాల్పడ్డారు. లెక్కలేనన్ని అవినీతి బాగోతాలు టీడీపీ హయాంలో జరిగినట్టు స్పష్టమవుతున్నాయి.



ఆ సమయంలో పనిచేయని కార్యదర్శి భవన ప్లాన్ అప్రూవల్ చేసినట్టుగా సృష్టించిన పత్రం

చర్యలు తీసుకుంటాం

సుందరనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి జిల్లా కలెక్టర్‌కు నివేదించాం. ప్రభుత్వ స్థలంలో పక్కా కమర్షియల్ కాంప్లెక్స్ అక్రమంగా కట్టారు. జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటాం.

– పి.బాల, తహసీల్దార్, కొత్తూరు.

కన్నుల 'పండుగ'లా జరిపిద్దాం

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు
- ఇచ్ఛాపురం స్వేచ్ఛావతి అమ్మవారి పండుగపై దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఇచ్ఛాపురంలో పదేళ్లకు ఒకసారి జరిగే శ్రీ స్వేచ్ఛావతి అమ్మవారి పండుగను విజయవంతం చేయాలని, నెల రోజుల పండుగలో ఒక్క అవాంఛనీయ ఘటన కూడా చోటు చేసుకోకూడదని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అధికారులు, కమిటీకి సూచించారు. ఇచ్ఛాపురంలో ఈ నెల 17 నుంచి మే 15 వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణపై సమన్వయ కమిటీ, అధికారులతో ఆయన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం సమావేశం నిర్వహించారు. పండుగ ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, వచ్చే భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకూడదని స్పష్టం చేశారు. కమిటీ సభ్యులకు, భక్తులకు అధికారుల సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ వేల సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున తప్పిపోయిన వారికోసం, ఇతర సమస్యలు తెలియజేసేందుకు సమాచార కేంద్రాలను పలుచోట్ల ఏర్పాటుచేయాలని కోరారు. కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం లేకుండా నిరంతరంగా తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను చేయాలని, ఈ పండుగ రోజుల్లో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాణసంచా వినియోగంలో కమిటీ సభ్యులు పూర్తి బాధ్యత వహిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ శాఖలు సమన్వయంతో కంట్రోల్ రూమును నిర్వహించాలని ఆదేశించారు. ఎస్పీ జీఆర్ రాధిక మాట్లాడుతూ ఉత్సవాలకు ప్రతి రోజూ సుమారు 50 వేల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున, సజావుగా జరిగేందుకు 250 మంది పోలీసులను మోహరిస్తున్నట్లు చెప్పారు. భక్తుల సౌకర్యార్థం 113 నంబరుతో కంట్రోల్ రూమ్‌ని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పారిశుద్ధ్యం కోసం 105 మంది సిబ్బందిని వినియోగిస్తున్నామని అన్నారు. మొబైల్ టాయిలెట్లు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మానను సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయి రాజ్, డీఆర్‌ఓ ఎం. రాజేశ్వరి, పలాస ఆర్డీఓ సీతారామ్మూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

'సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలి'




జిల్లా అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ

కవిటి:

వేసవిలో నీటి ఎద్దడి సమస్యను సమర్థంగా ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని అధికారులను జెడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ ఆదేశించారు. ఆమె తన నివాసంలో గురువారం జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాస్ ప్రసాద్, ఈఈ జోహెన్ బెన్హర్‌లతో సమీక్షించారు. రూ.700 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఉపరితల జలాల తాగునీటి పంపిణీ పథకం జల్ జీవన్ మిషన్ పనుల ప్రగతిపై సూచనలు చేశారు. తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మంచినీటి వనరుల నిర్వహణ పక్కాగా చేయాలన్నారు. మరమ్మతులకు అవసరమైన మెటీరియల్ గ్రామాల్లో ఉండాలని ఆదేశించారు. నీటి పథకాలకు, వాటర్ ప్లాంట్లకు విద్యుత్ సమస్య రాకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామాల్లోని బోరు మెకానిక్‌లకు చేతిపంపుల మరమ్మతులపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలిపారు.

ఎచ్చెర్ల క్యాంపస్: గొల్లపేటలో పిల్లలకు పాఠాలు చెబుతున్న కొత్త ఉపాధ్యాయుడు ఎస్పీ రమణ



మాస్టారు మాస్టారు.. మీ కృషికి జోహారు

ఎప్పటి కల ఇది. గురువు స్థానంలో నిలబడాలని, పిల్లల చేత మాస్టారు అని పిలిపించుకోవాలని ఎంతగా తపించారు. తపస్సులా సాధన చేసి పరీక్షలు రాశారు. పరీక్షలు అయిపోయాయి, ఫలితాలు వచ్చేశాయి. అర్హతలు ఉన్నా కొలువు దక్క లేదు. సహచరులంతా ముందుకువెళ్లిపోయారు. వీళ్ల బతుకులు మాత్రం వెనక్కి వెళ్లాయి. ఎట్టకేలకు 25 ఏళ్ల తర్వాత చాక్‌పీసు పట్టి నల్లబల్లపై రాసే భాగ్యం దక్కింది. పిల్లల వైపు చూసి సగర్వంగా పాఠాలు చెప్పే అవకాశం వచ్చింది. 1998 డీఎస్సీ అభ్యర్థులు కొలువుల్లో చేరారు. వైఎస్సార్‌సీపీ సర్కారు చొరవతో వీరి చిరకాల కల సాకారమైంది. –సాక్షి నెట్‌వర్క్



మెళియాపుట్టి: కేదారేశ్వరరావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

భగ భగ



- తారెత్తిస్తున్న ఎండలు
- ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి
- మే రాక ముందే భానుడి ఉగ్రరూపం

శ్రీకాకుళం 41°





ఎండతీవ్రత వల్ల నిర్మానుష్యంగా ఉన్న ఆమదాలవలస ప్రధాన రహదారి

ఆమదాలవలస:

సూరీడు పగలే చుక్కలు చూపిస్తున్నాడు. మధ్యాహ్నం పూట ఏ మాత్రం బయటకు వచ్చినా చెమట చుక్కలతో తడిపేస్తున్నాడు. గొడుగు, టోపీ వంటివి పట్టుకోకుంటే ఏ మాత్రం కనికరం లేకుండా దినకరుడు వేడి దాడి చేస్తున్నాడు. భానుడి ఉగ్రరూపానికి సిక్కోలు వాసులు విలవిలలాడుతున్నారు. అడుగు బయట పెట్టేందుకు కూడా భయపడుతున్నారు. ఈ పరిస్థితి జిల్లాలో మరో నాలుగైదు రోజుల కొనసాగే అవకాశం ఉందని ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ శాఖ శాస్త్రవేత్త డాక్టర్ మౌనిక తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉండడంతోపాటు జిల్లాలో వేడి గాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు. మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతాయని ఆమె తెలిపారు. నైరుతి రుతుపవనాలు జిల్లాను తాకే వరకు ఎండ తీవ్రత కొనసాగక తప్పదని చెబుతున్నారు. క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో అక్కడక్కడా ఈదురు గాలులతో కూడిన వర్షాలు కూడా పడే అవకాశాలు బలంగా ఉన్నప్పటికీ ఎండల తీవ్రత కూడా కొనసాగుతుందని తెలిపారు.

పెరిగిన ఉష్ణోగ్రతలు

జిల్లాలో మూడేళ్ల నుంచి ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన వారం రోజుల్లో అత్యధికంగా 41 డిగ్రీల వరకు వెళ్లాయి. గత ఏడాది కూడా ఏప్రిల్ నెలలో ఇన్ని రోజుల పాటు ఈ స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కాలేదు. శ్రీకాకుళం, రణస్థలం, పాతపట్నం, ఆమదాలవలస, కొత్తూరు ప్రాంతాల్లో వేడి చాలా అధికంగా ఉంది.

పెరిగిన తేమ శాతం

వాతావరణంలో వారం రోజులుగా భారీ మార్పులు కనిపిస్తున్నాయి. పగటిపూట గాలిలో తేమ శాతం 60–65 మధ్య నమోదవుతోంది. ఉష్ణోగ్రతలు కూడా 41 డిగ్రీలు దాటుతున్నాయి. గాలిలో తేమ శాతం పెరగడం, ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు వడగాల్పులు, ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రి పూట కూడా గాలిలో తేమ శాతం 70–75 మధ్య ఉంటోంది. దీనివల్ల రాత్రి ఉష్ణోగ్రతలు 30 డిగ్రీల పైనే నమోదవుతున్నాయి.

సబ్ స్టేషన్‌లో మంటలు



పైడిభీమవరం సబ్ స్టేషన్‌లో మంటలు

రణస్థలం: మండలంలోని పైడిభీమవరం సబ్ స్టేషన్‌లో ఎండ తీవ్రత వల్ల 33కేవీ ఫీడర్ బ్లాస్ట్ కావడంతో గురువారం సాయంత్రం భారీగా మంటలు వ్యాపించాయని పైడిభీమవరం ఏఈ శ్రీనివాససాహు తెలిపారు. దీంతో పైడిభీమవరం పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బ్లాస్ట్ వల్ల షిఫ్ట్ ఆపరేటర్ ప్రకాష్ చేతికి స్వల్ప గాయాలయ్యాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు మరమ్మతులు ముమ్మరం చేశారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం దేవదాయ శాఖ అధికారులతో పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో పలు దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. గ్రామాల్లో ఉన్న పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసి పూర్వవైభవం చూడాలన్నదే ప్రస్తుత ప్రభుత్వ ధ్యేయమన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాలయాలను పట్టించుకోకపోవడంతో వాటి ప్రాశస్త్యం తగ్గిందన్నారు. ఈ నేపథ్యంలోనే పురాతనమైన పలు దేవాలయాల పునఃనిర్మాణానికి ప్రభుత్వానికి నివేదించామన్నారు. గతంలో 20 శాతం మొత్తాన్ని ముందస్తుగా గ్రామస్తులు డిపాజిట్ చేస్తే మిగతా నిధులు వారి అకౌంట్‌కు పడే విధంగా వచ్చిన జీఓను అధికారులతో మాట్లాడి, ప్రభుత్వం నుంచి పదిశాతం డిపాజిట్ చెల్లించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. అందుకు నిధులు మంజూరైన ఆలయాలకు సంబంధించిన గ్రామస్తులు డిపాజిట్ చెల్లించి పనులు ప్రారంభించాలని స్పీకర్ కోరారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ డీసీ సునీత, ఏసీ ప్రసాదరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

భావనపాడు పోర్టుతో ఉపాధి అవకాశాలు

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: భావనపాడు పోర్టుతో జిల్లాలోని యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని సుంకర జగన్నాథపురంలో మాజీ సర్పంచ్ గంగెట్ల గున్న ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పలాస నియోజకవర్గం అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తోందన్నారు. భావనపాడు పోర్టు తీరప్రాంత ప్రజలకే కాకుండా, రాష్ట్రానికే మణిహారమని పేర్కొన్నారు. గత 40 ఏళ్లుగా ఈ ప్రాంత వాసుల కల నెరవేరబోతోందని తెలియజేశారు. ఈనెల 19వ తేదీన పోర్టు నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని ప్రకటించారు. అంతేకాకుండా పూండి–నౌపడ రహదారి డబుల్ లైన్ రహదారిగా మారబోతుందని, త్వరలోనే నిధులు మంజూరవుతాయని వెల్లడించారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు పుక్కళ్ల గురయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

'ఫిష్ ఆంధ్ర డెలీషియస్'తో ఉపాధి

- రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం రూరల్: ఫిష్ ఆంధ్రా డెలీషియస్‌తో నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ఫిష్ ఆంధ్రా డెలీషియస్ స్టాల్స్‌ను ఆయన గురువారం ప్రారంభించారు. జిల్లాలోనే తొలిసారిగా నెలికొల్పిన యూనిట్‌ను రాగోలు కేంద్రంలో ప్రారంభించడంపై హర్షం ప్రకటించారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ ఇప్పిస్తూ ఫిషరీష్ డిపార్ట్‌మెంట్ వీటిని ప్రధానమైన కేంద్రాల్లో ఏర్పాటు చేస్తోందని చెప్పారు. శ్రీకాకుళంలోని గుజరాతీపేట వద్ద, పాలిటెక్నిక్ కళాశాల వద్ద దీనికి సంబంధించి నిర్మాణాలు జరుగుతున్నట్లు చెప్పారు. ప్రతిపక్షాలు వీటిని అపహాస్యం చేసేవిధంగా ఫిష్‌మార్టులు, మటన్ మార్టులంటూ హేళన చేయడం తగదన్నారు. మత్స్యకారుల సంపదకు డిమాండ్‌ను క్రియేట్ చేసేందుకు జిల్లాలోని 27 ప్రధాన ప్రాంతాల్లో యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఉపసంచాలకులు పీవీ శ్రీనివాసరావు, జిల్లా మత్స్యకార సంఘ నాయకులు కోరాడ నర్సింగరావు, జిల్లా పంచాయతీ రాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, జెడ్పీటీసీ రుప్పదివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దనరావు, రాగోలు సర్పంచ్ జి.శంగల్వరావు, భాస్కర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌లో కిచెన్‌ను పరిశీలిస్తున్న మంత్రి ధర్మాన

క్లుప్తంగా

తండ్రి మృతి కేసులో కుమారుడి అరెస్టు

మెళియాపుట్టి: కుమారుడి మాటలకు మనస్తాపం చెంది వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనలో చాపర గ్రామానికి చెందిన షణ్ముఖరావును గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజేష్ తెలిపారు. గ్రామానికి చెందిన పట్టపగలు గురుమూర్తి (70) చిన్నకుమారుడు షణ్ముఖరావు ఇంట్లో ఉన్నబావిలో దూకి మంగళవారం ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. మృతుడి పెద్దకుమార్తె పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షణ్ముఖరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరం నుంచి శ్రీకాకుళం పట్టణానికి అక్రమంగా తరలుతున్న రేషన్ బియ్యాన్ని గురువారం అల్లినగరం సమీపంలో విజిలెన్స్, పౌరసరఫరాలు, రెవెన్యూశాఖల అధికారులు పట్టుకున్నారు. ఈ బియ్యం విలువ రూ.24320గా గుర్తించారు. గుడ్ల ధనుంజయ్ అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేశారు. ఆటో సీజ్ చేసి, డ్రైవర్‌పై శ్రీనువాసరావుపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎస్సై బి.రామారావు, సిబ్బంది కెల్ల అప్పన్న, ఈశ్వరరావు, శేషగిరిరావు పాల్గొన్నారు.

బుడంబో ఆశ్రమ హెచ్‌ఎం సస్పెన్షన్ ఎత్తివేత

మందస: మండలంలోని బుడంబోకాలనీ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన సవర ఆనందరావుపై ఐటీడీఏ విధించిన సస్పెన్షన్ ఎత్తివేశారు. ఆశ్రమంలో అవకతవకలు జరిగినట్టు ఆరోపణలు రావడంతో అప్పట్లో ఐటీడీఏ అధికారులు ఇచ్చిన నివేదిక ఆధారంగా పీఓ బి.నవ్య సస్పెండ్ చేశారు. గురువారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో ఆనందరావును సోంపేట మండలం మాలగోవిందపురం గిరిజన ఆశ్రమం పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయునిగా నియమించారు.

కారు ధ్వంసం కేసులో యువకుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ఈ నెల 9న అర్ధరాత్రి అలజడి చేసిన యువకుడ్ని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపారు. నగరంలోని పలు కాలనీల్లో కార్ల అద్దాలను పగులగొట్టడమే కాకుండా.. అదేరోజు పెదబరాటం వీధిలో మోటారు సైకిల్ దొంగిలించిన కేసులో ఫాజుల్‌బేగ్‌పేట్‌కు చెందిన కోరాడ దుర్గాప్రసాద్ (20)ను బలగ కూడలి వద్ద పట్టుకున్నట్లు చెప్పారు. దుర్గాప్రసాద్ ఐటీఐ చదివి ఖాళీగా ఉంటూ వ్యసనాలకు లోనై ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నట్లు.. సీసీ ఫుటేజీలో దృశ్యాల ఆధారంగా గుర్తించినట్లు తెలిపారు. దుర్గాప్రసాద్‌కు తోడు మరో వ్యక్తి కూడా ఉన్నాడని, అతనికోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కారులో దొంగిలించిన రూ. 2 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

బిలాయిలో రణస్థలం విద్యార్థి అదృశ్యం

రణస్థలం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలాయి ఐఐటీ(రాయిపూర్)లో చదువుతున్న జె.ఆర్.పురం పంచాయతీ లక్ష్మీనగర్‌కు చెందిన వట్టి అసిరప్పడు కుమారుడు ఈశ్వర్‌చంద్ అదృశ్యమయ్యాడు. మార్చి 7 నుంచి కుమారుడు నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి వెళ్లి ఆరా తీసినా ఫలితం లేకపోయింది. బిలాయి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఆచూకీ లభించలేదు. అక్కడి పోలీసులు సరిగ్గా దర్యాప్తు చేయడం లేదని, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని తమ కుమారుడి ఆచూకీ దొరికేలా చర్యలు తీసుకోవాలని అసిరప్పడు వేడుకుంటున్నారు.

నలుగురు ఎస్‌ఐలకు అటాచ్‌మెంట్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లాలో నలుగురు ఎస్‌ఐలను పలు పోలీస్ స్టేషన్లకు అటాచ్ చేశారు. శ్రీకాకుళం ఎస్‌బీ ఎస్‌ఐ ఎన్.నారాయణరావును సీసీఎస్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్‌ఐ వి.రమేష్‌ను ఎస్‌బీ-ఎక్స్‌కు, శ్రీకాకుళం టూటౌన్ ఎస్‌ఐ కె.వెంకటేష్‌ను ట్రాఫిక్ పీఎస్‌కు, కాశీబుగ్గ ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్‌ను శ్రీకాకుళం టూటౌన్‌కు అటాచ్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కే. 10గ్రా.)	59,670-00
బంగారం(22కే. 10గ్రా.)	54,700-00
వెండి (కిలో)	76,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹165	₹ 185

నిప్పు ముప్పు తప్పేలా..!



అగ్ని ప్రమాదాలు-నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది(ఫైల్)

- అగ్ని ప్రమాదాల నిరోధానికి అవగాహన కార్యక్రమాలు
- నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు
- మాక్‌డ్రిల్స్‌కు సర్వం సిద్ధం

ఇచ్ఛాపురం రూరల్:

ఓ వైపు ఎండలు దంచేస్తున్నాయి. బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. ఇదే సమయంలో అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు కూడా ఎక్కువే. ఈ నేపథ్యంలో అగ్ని ప్రమాదాల తీవ్రతను తగ్గించి ప్రాణాలను, ఆస్తులను కాపాడేందుకు అగ్నిమాపక శాఖ మాక్‌డ్రిల్స్‌తో ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఈ నెల 14 నుంచి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ముందు జాగ్రత్తలు తీసుకుంటే ప్రాథమిక దశలోనే అగ్నిప్రమాదాల నివారించవచ్చని అగ్నిమాపక సిబ్బంది చెబుతున్నారు.

అవగాహన సదస్సులు..

అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న అమర వీరులకు నివాళులు, 15న బహిరంగ ప్రదేశాలు, కూడళ్లలో అగ్నిప్రమాదాలు నివారణపై అవగాహన కల్పిస్తారు. 16న అపార్టమెంట్లు, 17న విద్యా సంస్థలు, 18న గ్యాస్ గొడౌన్స్, ఆయిల్ ఫార్మ్‌లు, 19న ఆస్పత్రుల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తారు. ఏప్రిల్ 20న అన్ని వర్గాల ప్రజలకు ఫైర్ సేఫ్టీపై వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

అందుబాటులో బుల్లెట్ సేవలు..

వేసవిలో అగ్ని ప్రమాదాలను ఎదుర్కొనేందుకు జిల్లా అగ్నిమాపక శాఖ సర్వం సిద్ధంగా ఉంది. ప్రమాద నివారణకు అవసరమైన పరికరాలు, యంత్రాలు, ఇంజన్లు సిద్ధంగా ఉన్నాయి. అడ్వాన్స్ వాటర్ టెండరింగ్ ఫైర్ ఇంజన్, రెస్క్యూ ఫైర్ ఇంజిన్, ట్రూప్ క్యారియర్, ఫైర్ బుల్లెట్ బైక్, మిస్ట్ జీప్‌లు అందుబాటులో ఉన్నాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

- చిన్న పిల్లలకు అగ్గి పెట్టెలు, లైటర్లు, టపాసులు వంటివి ఇవ్వకూడదు.
- దుస్తులకు నిప్పు అంటుకుంటే పరిగెత్తకుండా దుప్పటి వంటివి చుట్టుకోవాలి.
- వంట గదిలో కిరోసిన్, డీజిల్, పెట్రోల్, అదనపు గ్యాస్ సిలిండర్ వంటివి ఉంచకూడదు.
- మండుతున్న పొయ్యిపై వస్తువులను దూరం నుంచి అందుకోవాలని ప్రయత్నించవద్దు.
- మండుతున్న స్టవ్‌లో కిరోసిన్ పోయడం ప్రమాదకరం.
- చెడిపోయిన గ్యాస్ ట్యూబ్ స్థానంలో ఐఎస్ఐ మార్కు గల కొత్త ట్యూబ్‌ను అమర్చాలి.

నిబంధనలు పాటించాలి..



ఏప్రిల్ 14 నుంచి అగ్నిమాపక కేంద్రాల పరిధుల్లో వారోత్సవాలు నిర్వహించి అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తాం. అత్యవసర సమయాల్లో 101 నంబర్‌కు సమాచారం అందజేయాలి. బహుళ అంతస్తులు, పాఠశాలలు, ఆస్పత్రులు, దుకాణాలు, పరిశ్రమలు వంటి సంస్థల్లో అగ్నిమాపక పరికరాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. నిబంధనలు పాటించకపోతే ఫైర్ సర్వీస్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. – బి.వీరభద్రరావు, జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపకాధికారి, శ్రీకాకుళం

అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నెంబర్లు	
జిల్లా అగ్నిమాపకాధికారి	9949991052
సహాయక అగ్నిమాపకాధికారి	9949991053
ఇచ్ఛాపురం	08942-231101
సోంపేట	08947-234101
మందస	08947-237101
పలాస	08945-241101
టెక్కలి	08945-244277
కోటబొమ్మాళి	08942-238659
నరసన్నపేట	08942-276777
శ్రీకాకుళం	08942-220101
రణస్థలం	7032542833
పొందూరు	08941-242101
ఆమదాలవలస	08942-285401

అగ్నిమాపక వారోత్సవాల పోస్టర్లు ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆధ్వర్యంలో అగ్నిమాపక, ఆరోగ్య శాఖ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ నెల 14 నుండి 20 వరకు నిర్వహించనున్న అగ్నిమాపక వారోత్సవాల బ్యానరును విడుదలచేశారు. వడ దెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన చర్యలపై వైద్య ఆరోగ్య శాఖ రూపొందించిన కరపత్రాలను కూడా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జి.ఆర్.రాధిక, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, డీఆర్వో ఎం.రాజేశ్వరి, ఫైర్ అధికారి వీరభద్రరావు, డీఎంహెచ్‌ఓ బి.మీనాక్షి, డీసీహెచ్ జె.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

భూములు కాజేయాలనుకున్నారు

- ల్యాండ్ బ్యాంకింగ్‌తో వేల ఎకరాలను చంద్రబాబుకు అప్పగించేందుకు అచ్చెన్న పక్కా ప్లాన్ వేశారు
- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, పక్కనే జెడ్పీటీసీ దువ్వాడ వాణి

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలోని భావనపాడు ప్రాంతంలో పోర్టు నిర్మాణం దశాబ్దాల నాటి కల అని, దాన్ని ఆయుధంగా వాడుకుని ఇదే నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు ఎర్రన్నాయుడు, అచ్చెన్నాయుడు ఈ ప్రాంత ప్రజల్ని పెద్ద ఎత్తున మోసం చేశారని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ విమర్శించారు. ప్రతి ఎన్నికల్లో భావనపాడు పోర్టు నిర్మాణాన్ని అడ్డం పెట్టుకుని దశాబ్దాలుగా రాజకీయ పబ్బం గడుపుకున్నారే తప్ప ఈ ప్రాంతానికి పోర్టు తీసుకురాలేకపోయారని ఆయన గుర్తు చేశారు. ఆయన గురువారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత టీడీపీ పాలనలో పోర్టు నిర్మాణం చేస్తామని చెప్పి సుమారు 15 వేల ఎకరాలను ల్యాండ్ బ్యాంకింగ్ చెయ్యడానికి అచ్చెన్నాయుడు పెద్ద ఎత్తున కుట్ర చేశారని, ల్యాండ్ బ్యాంకింగ్‌తో వేల ఎకరాలను చంద్రబాబుకు కట్టబెట్టేందుకు పక్కాగా ప్లాన్ వేశారని ఎమ్మెల్సీ దువ్వాడ తీవ్రంగా ఆరోపించారు. సంతబొమ్మాళి మండలంలో పవర్ ప్లాంట్ నిర్మాణం జరుగుతున్న సమయంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అచ్చెన్న వేలాది మంది నిరుద్యోగులను మోసం చేశారని గుర్తు చేశారు. భావనపాడు పోర్టు పేరుతో గత టీడీపీ ప్రభుత్వంలో 15 వేల ఎకరాలను దోచుకునే ప్రయత్నం చేశారని, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేవలం 400 ఎకరాల్లో సుమారు 4 వేల కోట్ల రూపాయలతో పోర్టు నిర్మాణానికి కార్యరూపం దాల్చే విధంగా కృషి చేశారని దువ్వాడ పేర్కొన్నారు. అంతే కాకుండా అన్ని రకాల అడ్డంకులను ఎదుర్కొని పోర్టు నిర్మాణానికి ఈ నెల 19న శంకుస్థాపన చేయనున్నారని దువ్వాడ వెల్లడించారు. పోర్టు నిర్మాణంతో జిల్లాతో పాటు టెక్కలి నియోజకవర్గం పెద్ద ఎత్తున పారిశ్రామికంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. దీనికి అనుసంధానంగా ఎన్నో పరిశ్రమలు వెలసి నియోజకవర్గంలో 528 గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఎంతో మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని దువ్వాడ ఆనందం వ్యక్తం చేశారు. పోర్టు నిర్మాణం కోసం భూములను త్యాగం చేసిన మూలపేట, విష్ణుచక్రం గ్రామాలతో పాటు రోడ్డు కోసం భూములు ఇచ్చిన రైతులకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు. దివంగత నేతలు జలగం వెంగళరావు, వైఎస్సార్ తరువాత జిల్లాతో పాటు టెక్కలి నియోజకవర్గం అభివృద్ధికి అత్యధికంగా నిధులు కేటాయించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని అన్నారు. ఈ మీడియా సమావేశంలో టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి ఉన్నారు.

సచివాలయ మహిళా పోలీసు ప్రతిభ



అమ్మోజీని సత్కరిస్తున్న అతిథులు, ప్రముఖులు

శ్రీకాకుళం కల్చరల్: తిరుపతి సాహితీ బ్రహ్మోత్సవాలలో భాగంగా జరిగిన కార్యక్రమాల్లో నాలుగు ప్రపంచ రికార్డులు దక్కాయని ఉత్సవాల మీడియా ప్రతినిధి, కోష్ట సచివాలయం మహిళా పోలీసు బమ్మిడి అమ్మోజీ అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ టెక్కలి మండలం పోలవరం తన స్వగ్రామమని, 'అమ్మో' పేరుతో రచనలు, పుస్తక సమీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతి సంస్థ శ్రీశ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్టు సంయుక్తంగా ఇటీవల తిరుపతిలో నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలలో 2860 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించారని, అటువంటి కార్యక్రమానికి మీడియా ప్రతినిధిగా వ్యవహరించినందుకు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్, టి.ఎన్.ఏ. (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ) బుక్ ఆఫ్ రికార్డ్స్, కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, ఉత్సవ చైర్మన్ కత్తిమండ ప్రతాప్, కింగ్ ఇంద్ర, జాతీయ కన్వీనర్ కొల్లీ రమాపతిల నుంచి సత్కారం పొందినట్లు పేర్కొన్నారు.

ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శంకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాది కొమర శంకరరావుని ప్రభుత్వం మానవ హక్కుల కమిషన్ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించింది. ఈ మేరకు ఉత్తర్వులు వెలువడ్డాయి. శంకరరావును జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యా వు, ప్రతినిధులు, న్యాయవాదులు గురువారం అభినందించారు.

బీసీ కులగణన చరిత్రాత్మకం

- రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్



మాట్లాడుతున్న రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, నాయకులు

టెక్కలి : బీసీ కులగణనకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంగీకారం తెలియజేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. గురువారం టెక్కలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల అభ్యున్నతి కోసం పాటు పడిన పూలే జయంతి నాడు రాష్ట్రంలో బీసీ కుల గణన కోసం సీఎం వైఎస్ జగన్ అంగీకారం తెలియజేయడం హర్షనీయమన్నారు. గత ప్రభుత్వాలు బీసీ కులగణన అంశాన్ని కనుమరుగు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో బీసీలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేయడంతో పాటు కేబినెట్, స్థానిక సంస్థల్లో సైతం బీసీలకు అగ్ర స్థానం కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎన్.శ్రీరామ్మూర్తి, టెక్కలి ఎంపీటీసీ సత్తారు ఉషారాణి, నాయకులు సత్తారు సత్యం, టి.బి.జి.గుప్తా, తమ్మన్నగారి కిరణ్, డి.భూషణ్‌రెడ్డి, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన

- రాష్ట్ర కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న కళింగవైశ్య కార్పొరేషన్ చైర్మన్ సూరిబాబు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): పూలే ఆశయాలకు అనుగుణంగా బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. పూలే జయంతి నాడు బీసీ కులగణనకు సీఎం శ్రీకారం చుట్టడం, అందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చొరవ తీసుకోవడం అభినందనీయమన్నారు. శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 189 బీసీ కులాలకు న్యాయం చేసేలా కుల గణన జరుగుతుందన్నారు. కోవిడ్ కారణంగా ఆలస్యమైన దేశవ్యాప్త జనగణన సేకరణలో బీసీ కులాన్ని పట్టికలో చేర్చి కులగణన చేపట్టాలంటూ కేంద్రాన్ని కోరుతూ ఇప్పటికే ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిందని గుర్తు చేశారు. సమావేశంలో కళింగవైశ్య సంఘం అధ్యక్షుడు కోణార్క్ శ్రీను, ఊన్న నాగరాజు, అంధవరపు సంతోష్, ప్రసాదు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు గ్రీన్‌సిగ్నల్ అభినందనీయం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ సంఘాల ఇరవై ఏళ్ల పోరాట ఫలితంగా కులగణనకు ఏపీ ప్రభుత్వం మద్దతు తెలపడం హర్షణీయమని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ జనాభాలో 52 శా తానికి మించి ఉన్న బీసీలకు న్యాయం జరగాలంటే బీసీ జనగణన ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు



మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యవసాయ అధికారులు

రణస్థలం: రైతు తన పొలంలోని భూసార పరీక్షలు జరిపి పోషక పదార్థాల (సత్తువ) స్థాయి ఎంత ఉందో తెలుసుకొని పంటలు పండిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయశాఖ డీడీఏ కె.త్రినాథస్వామి అన్నారు. అర్జునవలసలో సాయిల్ హెల్త్ కార్డు పథకంలో భాగంగా భూసార పరీక్షలపై రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం మట్టి నమూనాలు సేకరించి భావస్వరూపం వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేల స్వభావం, పోషకాల స్థాయి, వాటి లభ్యతను బట్టి పంట దిగబడులు ఆధారపడి ఉంటాయని చెప్పారు. సాయిల్ హెల్త్ కార్డు తీసుకుంటే భూ ఆరోగ్య విశ్లేషణ పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ డి.విజయభాస్కర్, హెచ్ఓ అనూషా, ల్యాబ్ ఏఓ సుభాషిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక లారీలు స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలను ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం అర్ధరాత్రి పట్టుకున్నా రు. చిలకపాలెం వద్ద పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. సీజ్ చేసిన ఇసుకను మైన్స్ విభాగానికి అప్పగించి కేసు నమోదు చేశారు.

ముగిసిన జేఈఈ మెయిన్స్ పరీక్షలు



శివానీ ఇంజనీరింగ్ కాలేజ్‌లో విద్యార్థుల హాల్ టికెట్లు పరిశీలిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో రెండు కళాశాలల్లో ఈ నెల 6 నుంచి కొనసాగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలు గురువారంతో ముగిశాయి. ఈ నెల 6, 8, 10, 11, 12, 13 తేదీల్లో పరీక్షలు కొనసాగాయి. చివరి రోజు గురువారం ఎచ్చెర్లలోని శ్రీవేంకటేశ్వర ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 99 మందికి 98 మంది, రెండో షిఫ్టులో 99 మందికి 99 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 80 మందికి 80 మంది, రెండో షిఫ్టులో 80 మందికి 78 మంది హాజరయ్యారు. ఎన్‌టీఏ అధికారులు పర్యవేక్షించారు.

గురుకులంలో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ గురుకుల పాఠశాలలు ఎస్‌ఎం పురం (బాలురు), వమరవల్లి (బాలికలు)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్న ట్లు కన్వీనర్, ఎస్‌ఎంపురం గుకులం ప్రిన్సిపా ల్ శ్రీనివాసరావు గురువారం చెప్పారు. 5వ తరగతిలో పూర్తిసీట్లు, 6, 7, 8వ తరగతుల్లో ఖాళీ సీట్లకు ప్రవేశాలు కల్పించనున్నట్లు తెలి పారు. ఈ నెల 24లోపు హెచ్‌టీటీపీఎస్://ఏపీఆర్‌ఎస్.ఎపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏపీ గురుకులా ల్లోని ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రవేశాలకు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9866559611, 9866559612 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కొయ్యాంలో పూరిల్లు దగ్ధం



కాలిపోయిన పూరిల్లు

ఎచ్చెర్ల క్యాంపస్: కొయ్యాం గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మజ్జి కన్నంనాయుడుకు చెందిన పూరిల్లు కాలిపోయింది. స్థానికులు స్పందించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే ఇంట్లో ఉన్న ఆహార ధాన్యాలు, దుస్తులు కాలి బూడిదయ్యాయి.

రామయ్యవలసలో గోశాల..

జలుమూరు: రామయ్యవలసలో జరిగిన అగ్నిప్రమాదంలో జామాన నరసింహులుకు చెందిన గోశాల అగ్నికి ఆహుతవ్వగా, పాడి ఆవుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ధాన్యం, వ్యవసాయ పరికరాలు కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.50 వేలు ఆస్తి నష్టం ఉంటుందని అంచనా.

పూలే, అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమాలు



బాలిగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు

మందస: మహాత్మాజ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని కుల నిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు బెలమర ప్రభాకర్ పిలుపునిచ్చారు. బాలిగాంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అగ్రకుల ఆధిపత్య శక్తులకు వ్యతిరేకంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాల ఏర్పాటును కొంతమంది అడ్డుకుంటున్నారన్నారు. భారత రాజ్యాంగం రక్షణకై ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో కేవీపీఎస్, దళిత నాయకులు పరమేశ్వరరావు, రామమూర్తి, లక్ష్మి, జానకి, రమణమ్మ, సురేష్, అప్పారావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.